క్లుప్తంగా

అధ్వానంగా పాఠశాల పరిసరాలు



మానవపాడు: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిసరాలు అధ్వానంగా మారాయి. పందుల బెడద, చెత్తాచెదారంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. పాఠశాలలో దాదాపు 430 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. నిత్యం పాఠశాలలో పందులతో సహవాసం చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పందులు స్వైరవిహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలో పందుల బెడదను తప్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలి



మానవపాడు : మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి–44కు వెళ్లే దారిలో అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, ప్రజలు కోరుతున్నారు. అండర్ బ్రిడ్జిలో రాత్రి సమయంలో చీకటిమయంగా ఉండటంతో ప్రయాణించేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు వెంటనే లైట్లు అమర్చి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

హెల్మెట్ వినియోగం తప్పనిసరి

కేటీదొడ్డి: రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో దిచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగం తప్పనిసని ఎస్ఐ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రమాద సమయంలో హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణాలు కాపాడుకోవడం సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం

గద్వాల క్రైం: బాలిక అదృశ్యమైన సంఘటన గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో చోటు చేసుకుంది. రూరల్ ఎస్ఐ శ్రీకాంత్ కథనం మేరకు.. గద్వాల మండలానికి చెందిన బాలిక (17) ఆదివారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి



ఎర్రవల్లి: గుట్టు చప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం కోదండాపురం పోలీసులు దాడి చేశారు. ఎస్సై స్వాతి తెలిపిన వివరాలు.. మానవపాడు మండల పరిధిలోని బోరవెల్లి గ్రామంలో పేకాట నిర్వహిస్తున్నారన్నా సమాచారం మేరకు దాడి చేసినట్లు తెలిపారు. దాడిలో అదే గ్రామానికి చెందిన కృష్ణ, ఎండీ హుసేన్, పామిరెడ్డిపల్లికి చెందిన రమేష్‌ను అదుపులోకి తీసుకోగా మరో ఇద్దరు పరారైనట్లు తెలిపారు. వారి వద్ద ద్విచక్ర వాహనం, మూడు మొబైల్స్, రూ.17,505 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఆనంద్‌కు సత్కారం

ఆత్మకూర్: జాతీయ మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా రాష్ట్రం తరపున ఆరేపల్లికి చెందిన మత్స్యకారుడు ఏటికాడి ఆనంద్ రాష్ట్రపతి అవార్డు అందుకోవడం గర్వకారణమని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో ఎంపీ ఆనంద్‌ను పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేపల్లిలో పదేళ్లుగా చేప పిల్లను ఉత్పత్తి చేస్తూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలో సబ్సిడీ చేపపిల్లలను ప్రభుత్వం ద్వారా పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో అశోక్‌జీ, కంభాళపురం రాము, సుధాకర్, నరేందర్ తదితరులు ఉన్నారు.

అన్నదాతల ఆందోళన

- త్రీఫేస్ విద్యుత్ సరఫరా సమయం కుదింపుపై అభ్యంతరం
- వాడుముఖం పడుతున్న పంటలు
- సమస్య పరిష్కరించాలంటున్న రైతులు



అయిజ సబ్ స్టేషన్

శాంతినగర్ : ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే సమయంలో విద్యుత్ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పంట కంకి దశలో ఉండగా.. త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో కోతలు విధించడంతో నీటితడులు పూర్తి స్థాయిలో అందడం లేదని వాపోతున్నారు. తడులు పూర్తిగా అందని పక్షంలో పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వాడుబడుతున్న పంటలు..

గత నెల 25వ తేదీ నుంచి రోజుకు ఎనిమిది నుంచి తొమ్మిది గంటలపాటు త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో కోత విధించడంతో నీరు తడులు అందక పంటలు వాడుబడుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. చలికాలంలోనే పరిస్థితి ఇలా ఉంటే వేసవిలో పరిస్థితి ఎలా ఉంటుందోనని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

సాయంత్రం, రాత్రి వేళల్లో..

ప్రతి రోజు సాయంత్రం 4 గంటలకే త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిపివేసి సింగిల్ ఫేస్ సరఫరా చేస్తున్నారు. అర్ధరాత్రి 12 నుంచి ఒంటి గంట మధ్య త్రీఫేస్ సరఫరా చేస్తున్నారు. సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరాతో పంటలకు నీరు పెట్టడం కుదరడం లేదని రైతులు పేర్కొన్నారు. గతంలో సాయంత్రం 5.30 గంటలకు త్రీఫేస్ సరఫరా నిలిపివేసేవారని తెలిపారు. గద్వాల ఫీడర్ నుంచి సరఫరా అయ్యే అయిజ 33/11 కేవీ సబ్ స్టేషన్, వెంకటాపురం 11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో సమస్య ఏర్పడిందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

కోతలు విధించొద్దు..

గత వారం రోజులుగా రెండు నుంచి త్రీఫేస్ విద్యుత్ సరఫరా సరిగా అందడం లేదు. ప్రస్తుతం మొక్కజొన్న పంట కంకి దశలో ఉంది. నీటి తడులు ఎక్కువగా కావాల్సిన సమయంలో విద్యుత్ సమస్యతో నీటి తడులు అందక పంట దిగుబడి తగ్గిపోతుంది. ఎప్పటిలాగే త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేసి రైతులను ఆదుకోవాలి.

-కృష్ణ, యాపదిన్నె, అయిజ

లోడ్ పడుతోంది..

త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో కోత విధించడంతో రైతులందరూ ఒకేసారి మోటార్లు వేస్తున్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లపై లోడ్‌పడి మోటార్లు నడవడం లేదు. గతంలో విద్యుత్ సమస్య లేదు. గత వారం రోజులుగా త్రీఫేస్ విద్యుత్ సరఫరాలో సమస్య ఉంది. పంట చేతికందే సమయంలో నీటి తడులు ఎక్కువగా పెట్టాల్సి ఉంటుంది.

- మద్దిలేటి, తనగల, వడ్డేపల్లి

రెండు రోజుల్లో పరిష్కారం..

జూరాల సమీపంలోని పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేపడుతున్నారు. వారం రోజులుగా విద్యుత్ సరఫరాలో సమస్య ఉంది. మరో రెండు రోజుల్లో మరమ్మతులు పూర్తవుతాయని ఉన్నతాధికారులు చెబుతున్నారు. మరమ్మతులు పూర్తయిన వెంటనే ఎప్పటిలాగే త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తాం.

- గోవిందు, విద్యుత్‌శాఖ, ఏడీఈ, అయిజ

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటాలి



ఎంపికైన జిల్లా జట్టు క్రీడాకారులు

గద్వాలటౌన్ : క్రీడాకారులు నిర్మాణాత్మకమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి, రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో సత్తా చాటాలని జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నర్సింహ, కోశాధికారి చందు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 4 నుంచి 7వ తేదీ వరకు ఆదిలాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొనే జిల్లా తుది జట్టును ఆదివారం ఎంపిక చేశారు. సద్దాం, వెంకటేష్, గోవర్ధన్, సంజీవ్, రాజు, రవి, పరశ, హరి, శ్రీను, విజయ్, అనూప్, మునిస్వామి ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు జిల్లా అసోసియేషన్ తరపున కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రవి, కరెంటు నర్సింహ, నగేష్, జగదీష్, రాజేందర్, రైల్వే పాషా, వెంకటన్న, బుజ్జిబాబు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

అలంపూర్ : ప్రభుత్వ భూములను కబ్జా నుంచి కాపాడాలని ఉండవెల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. అలంపూర్ చౌరస్తాలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అలంపూర్ చౌరస్తాలోని భూదాన్, సీలింగ్, అసైండ్ భూములను కొందరు బీఆర్ఎస్ నాయకులు కబ్జా చేస్తున్నారని విమర్శించారు. జిల్లా అధికారులు, స్థానిక అధికారులు బీఆర్ఎస్ నాయకులకే సహకరిస్తున్నారని ఆరోపించారు. భూ దందాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నాయకులపై ఉన్నత అధికారులు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అలంపూర్, మానవపాడు మండలాల అధ్యక్షులు అడాకుల రాము, జగన్‌మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో ప్రశాంతత



పూజల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

ధరూరు: మండల పరిధిలోని పెద్దచింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెప్పోత్సవం పల్లకిసేవ, ప్రభోత్సవ కార్యక్రమాలు జరిగాయి. ఉత్సవాల్లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన రెడ్డి మండల మాజీ ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆధ్యాత్మికతతో ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం రాత్రి నిర్వహించనున్న రథోత్సవం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరరావు, అర్చకుడు కిష్టచార్యులు, మద్వచారి, మాజీ జెడ్పీటీసీ పద్మ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు సుదర్శన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, డీఆర్ విజయ్‌కుమార్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి..

కేటీదొడ్డి: మండలంలోని చింతరేవుల గ్రామంలో రూ.10 లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఆదివారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి భూమి చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాలను అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పద్మ వెంకటేశ్వర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, నాయకులు వెంకట్రామి రెడ్డి, వేణుగోపాల్, విజయ్, వంశీ, హనుమంతు రెడ్డి, ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా ప్రదర్శన విజయవంతం చేయాలి



అయిజలో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు



మల్దకల్‌లో వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్దకల్ : ఈనెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు మహా ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మోషన్న, భాస్కర్, చిన్న తిమ్మన్న, లక్ష్మన్న కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో మహాప్రదర్శన వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఏబీసీడీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్ చేస్తున్న సుదీర్ఘ పోరాటాన్ని విజయవంతం చేసేందుకు ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇసాక్, జయనందం, యాకోబు, ప్రభాకర్, తిమ్మరాజు, సురేష్, నర్సింహులు, జయన్న, వెంకటన్న, కృష్ణ, ప్రవీణ్, తిమ్మప్ప, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గట్టులో..

గట్టు : లక్ష డప్పులు.. వేల గొంతులు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బల్గెర ఏసన్న అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహం వద్ద మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతులు మహా ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహాసభకు పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ బండారి డేవిడ్, గట్టు మండల కళాకారుల సంఘం అధ్యక్షుడు నర్సింహులు, గోపాల్, ప్రభు, చిన్నన్న, కాశీమన్న, ఈదన్న, దశరథరాముడు, కర్రెప్ప,శాంతన్న, రంగమ్మ, సంతోషమ్మ,సునిత, మణెమ్మ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ..

అయిజ : లక్ష డప్పులు.. వేల గొంతులు మహాసభ వాల్‌పోస్టర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. ఈనెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతుల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో డప్పు కళాకారులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ



రాజోళి: మండల కేంద్రంలోని భ్రమంరాంబ అడివేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం మహా గణపతి యంత్ర విగ్రహ ప్రతిష్ఠతను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు చేశారు. హోమం తదితర క్రతువులు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

ఆత్మకూర్: పట్టణంలోని బీసీ కాలనీలో వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా టెన్నిస్‌బాల్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఏడురోజులుగా జరిగి పోటీల్లో 26 జట్లు తలపడ్డాయి. మొదటి విజేత మూలమళ్ల జటుక్టు రూ.10 వేలు నగదును బీజేపీ రాష్ట్రనాయకుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి, రెండో బహుమతిని సాధించిన మినీ స్టేడియం జట్టుకు కొత్తూరు నర్సింహ రూ.5 వేల నగదును, షీల్డులను బహూకరించారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అశోక్‌భూపాల్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మనోహర్‌గౌడ్, నాయకులు బోరెల్లి రాము, వెంకట్రాములు, సూరి, డాన్స్ మాస్టర్ బాలు, కురుమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపులో అన్యాయం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అమరచింత: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రంలోని కార్మిక, కర్షక వర్గాలతో పాటు సామాన్యులకు అన్యాయం జరిగిందని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకానికి సంబంధించి నిధుల కేటాయింపులో వివక్ష చూపారని మండిపడ్డారు. ఉపాధికూలీ రోజువారి రూ.600 మేరకు చెల్లించాలని, ఏడాదిలో 200 రోజుల పనిదినాలు కల్పించాలని, పట్టణ ప్రాంతాల్లో ఉపాధి పనులను చేపట్టాలని ఆందోళన చేస్తున్నా.. కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సంపన్నుల కోసమే కేంద్రం బడ్జెట్ ప్రవేశపెట్టినట్లుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు కేవలం 2 శాతం నిధులు కేటాయించడంపై ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో రాష్ట్ర వాటా పెంచాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



సమావేశంలో డీటీఎఫ్ నాయకులు

గద్వాలటౌన్ : డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శి మునిస్వామి ఎన్నికల పరిశీలకులుగా హాజరయ్యారు. అనంతరం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రభాకర్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ్‌కిరణ్, ఉపాధ్యాక్షులుగా హరిబాబు, స్రవంతి, యాకూబ్, సంయుక్త కార్యదర్శులుగా కావలి మన్యం, సాయిబాబ, ప్రవీణ్‌కుమార్, అరుంధతి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా హనుమంతు, సభ్యులుగా కృష్ణయ్య, బీసన్న, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా ప్రభుదాసు ఎన్నికయ్యారు. అనంతరం పలు తీర్మానాలు చేశారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలతో పాటు పీఆర్‌సీని తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులందరకి రావాల్సిన బెనిఫిట్స్ విడుదల చేయాలని, ప్రభుత్వం విద్యా రంగానికి బడ్జెట్‌లో 20 శాతం నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

జిల్లా పీఈటీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం స్థానికంగా జరిగిన పీఈటీల సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రిటైర్డ్ డీవైఎస్ఓ బీఎస్ ఆనంద్ ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా బీసన్న, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణయ్య, ఉపాధ్యాక్షులుగా వెంకట్రాములు, పార్వతమ్మ, రజనీకాంత్, సహాయ కార్యదర్శులుగా జగదీష్, రాములమ్మ కోశాధికారిగా మల్లేశ్వరి, కార్యవర్గ సభ్యులుగా రాజు, వీరేష్, మంజుల, దేవేందర్, రాజేంద్ర, రఘు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీవైఎస్ఓ జితేందర్, రిటైర్డ్ పీడీలు వీరవసంత రాయుడు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొండేరులో సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1999–2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీ వేడుక ఘనంగా నిర్వహించారు. ఆదివారం పాఠశాలలో విద్య బోధించిన గురువులకు సన్మానం చేశారు. స్నేహితులంతా ఒక చోట చేరి విందు భోజనంలో చేశారు. అలనాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం..

ఎర్రవల్లి: మండల పరిధిలోని కొండేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2009–10 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను పూలమాలలు శాలువాతో ఘనంగా సత్కరించారు. మండల విద్యాధికారి అమీర్‌పాష సమ్మేళనంలో హాజరై మాట్లాడారు. చదువుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు సహకారం అందించాలని పూర్వ విద్యార్థులకు సూచించారు. ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిమ్మప్ప బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- నేటి నుంచి ఉత్సవాలు ప్రారంభం
- 3 నుంచి 6 వరకు ప్రత్యేక పూజలు
- మూడో తిరుపతిగా పేరొందిన గట్టు తిమ్మప్ప



కొండపై వెలసిన గట్టు తిమ్మప్ప ఆలయం

మక్తల్ : మూడో తిరుపతిగా పేరుగాంచిన నియోజకవర్గంలోని మాద్వార్ నల్లకొండల్లో వెలసిన నామాల స్వామి శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి(గట్టు తిమ్మప్ప) బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమయ్యాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే తిమ్మప్ప స్వామి ఉత్సవాలకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి 6వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి.

పల్లకీ సేవతో ప్రారంభం..

మక్తల్ మండలం మాద్వార్ గ్రామంలో కొండపై వెలసిన శ్రీగట్టు తిమ్మప్పస్వామి(లక్ష్మీవేంకటేశ్వర స్వామి) బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభించనున్నట్లు ఉత్సవ నిర్వాహకులు, మక్తల్ మాజీ మార్కెట్ డైరెక్టర్, ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 3న సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ చైర్మన్ రాజేశ్వర్‌రావు ఇంటి నుంచి పల్లకి సేవతో కొండపైకి తీసుకెళ్తారు. పవిత్ర జలాలతో పుష్కరస్నానం చేయించి పద్మావతి లక్ష్మీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. కల్యాణోత్సవం సందర్భంగా మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు.

సేవల వివరాలు..

3వ తేదీ సోమవారం ప్రభోత్సవం,"4న మంగళవారం కల్యాణోత్సవం, రథోత్సవం, 5న శనివారం పాలఉట్ల కార్యక్రమం, 6వ తేదీ శివస్వాముల మహపూజ కార్యక్రమం, గరుడవాహన సేవలు చేస్తారు. 5 రోజుల పాటు నిర్వహించనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా షోలాపూర్, బొంబాయి, అంబర్‌నాథ్, హైదరాబాద్, గోవా, పూణే, బెంగళూర్, కర్ణాటక, వంటి పట్టణాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.



మాద్వార్‌లో కొండపై వెలసిన గట్టుతిమ్మప్ప స్వామి

ఏర్పాట్లు పూర్తి..

సోమవారం నుంచి నుంచి ప్రారంభమయ్యే స్వామివారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు రాజేశ్వర్‌రావు తెలిపారు. మంచినీరు, విద్యుత్ సౌకర్యం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉత్సవాల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా నూతనంగా 15 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. తాగునీటి సౌకర్యం కోసం 10 ట్యాంకర్లు ఏర్పాటు చేశారు. 4వ తేదీ సాంస్కృతిక కార్యక్రమాలను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వేడుకలు విజయవంత చేయాలని నిర్వాహకులు కోరారు.

మహిమలు చూపి

మాద్వార్ గ్రామంలోని కొండపై కొలువుదీరిన శ్రీగట్టుతిమ్మప్పస్వామి ఆలయాన్ని సుమారు 400 సంవత్సరాల క్రితం నిర్మించారు. పూర్వం ఈ కొండపై ప్రకృతి రమణీయమైన అందాలతో ప్రశాంత వాతావరణంలో స్వామివారు సంచరిస్తుండేవారని ప్రతీక. ప్రతిరోజు కొండపై పశువుల కాపరులతో స్వామి వారు మానవ రూపంలో ఆటలాడుతూ, వారు తెచ్చిన సద్ది ముద్దలతో కాలక్షేపం చేసేవారు. ఒక రోజు స్వామివారు కొండపై ఒక గుండులో ప్రత్యక్షమై మహిమలు చూపి ఇంతకాలం మీతో ఆడుతూ, పాడుతూ గడిపినది నేనే గట్టుతిమ్మప్ప స్వామినని పేర్కొన్నట్లు కథనం. అప్పటి నుంచి కలియుగ వైకుంఠం శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిరూపమై శ్రీగట్టుతిమ్మప్ప స్వామిగా ప్రాంత ప్రజలు పూజలు చేసి తరిస్తుండటం విశేషం. స్వామి వారిని 41రోజుల పాటు భక్తి ప్రపత్తులతో కొలిచిన వారికి ఇతిబాధలు తీరుతాయని భక్తుల విశ్వాసం.